VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 300
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
గురువారం 16 ఏప్రిల్ 2026



# నీటి భద్రత కోసం జలధార యాక్షన్ ప్లాన్

- పోలవరం నీటి వినియోగంపై ముందే ప్రణాళిక
- నేరడి బ్యారేజ్, చింతలపూడి మెయిన్ కెనాల్‌కు త్వరలో టెండర్లు
- జూన్ చివరి కల్లా వెలిగొండ స్టేజ్ 1 పనులు పూర్తి కావాలి
- జల వనరుల శాఖ పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి,కలంకౌంటర్ :** పోలవరం ప్రాజెక్టు పూర్తి కాగానే గోదావరి జలాలను కుడి, ఎడమ కాలువల ద్వారా తరలించి వాటిని ఏయే అవసరాలకు, ఎంత మేర వినియోగించుకోవాలనే దానిపై ఓ నిర్దుష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపేలా ప్రణాళిక చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై క్యాంపు కార్యాలయంలో జల వనరుల శాఖ అధికారులతో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు...వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం- నల్లమల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపూడిశిల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో భూగర్భజలాల పెంపు, జల ధార, జల హారతి కార్యక్రమాలపైనా సమీక్షించారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులైన తారక రామ, మహేంద్ర తనయ, తోటపల్లి బ్యారేజ్, మద్దువలస, జంఝావతి, హీరమండలం లిఫ్ట్ పనుల్లో వేగం పెంచాలని సీఎం సూచించారు. డిసెంబర్ నాటికి వంశధార-నాగావళి అనుసంధానం, జూలై నాటికి నాగావళి-చంపావతి అనుసంధానం పూర్తి చేయాలన్నారు. శ్రీకాకుళం జిల్లా వంశధార నదిపై నిర్మించ తలపెట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగడంతో త్వరితగతిన టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు.

**పర్యాటక కేంద్రంగా పోలవరం ప్రాజెక్టు..** పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని... హోటల్స్, షాపింగ్ ఏరియా ఉండాలని సీఎం అన్నారు. ప్రాజెక్టు సమీప ప్రాంతాల సుందరీకరణకు సంబంధించిన డిజైన్లను సీఎం పరిశీలించారు. పోలవరం-పాపికొండలు-భద్రాచలం వరకు బోటింగ్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాటర్, రాక్, ఫారెస్ట్, స్పోర్ట్స్ థీమ్‌తో పర్యాటకుల్ని ఆకట్టుకోవాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించేలా పనుల్లో వేగం పెంచాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రాజెక్టులో భాగమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి లోగా పూర్తి చేయాలని నిర్దేశించారు. ట్విన్ టన్నెల్స్ లైనింగ్ పనులు 77 శాతం, అప్రోచ్ చానల్ ఎర్త్ వర్క్ పనులు 98 శాతం, హెడ్ రెగ్యులేటర్ కాంక్రీట్ పనులు 71 శాతం, ఇరిగేషన్ టన్నెల్ తవ్వకాలు పూర్తి అయ్యాయని, లైనింగ్ 76 శాతం పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. కేఎల్ బండ్ ఎర్త్ వర్క్, ఎంబార్క్‌మెంట్ రెండూ 89 శాతం మేర పూర్తి అయ్యిందని.. ఏడాది జూన్ కల్లా అన్ని పనులు పూర్తి చేస్తామని వివరించారు. ఆర్ అండ్ ఆర్ కి సంబంధించి 95 కాలనీలకు గాను 26 పూర్తి అయ్యాయని, మిగిలిన వాటిలో 49 కాలనీలు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి, మరో 20 కాలనీలు 2027 ఏప్రిల్ నాటికి పూర్తి కానున్నాయని చెప్పారు. తొలిదశలో 38,060 నిర్వాసిత కుటుంబాలకు గాను, ఇప్పటివరకు 16,763 కుటుంబాలను తరలించినట్టు అధికారులు వివరించారు. ఈ ఏడాది ఆగస్ట్ నాటికి 8,518 కుటుంబాలు, 2027 మార్చి నాటికి 12,779 కుటుంబాల తరలింపు పూర్తి కావాలని సీఎం సూచించారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.27,089 కోట్లు వ్యయం కాగా, మరో రూ.5,108 కోట్లతో సివిల్, ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తి కానున్నాయి.

**శరవేగంగా వెలిగొండ స్టేజ్ 1 పనులు..** వెలిగొండ స్టేజ్ 1కు సంబంధించి హెడ్ రెగ్యులేటర్ కాంక్రీట్ పనులు 74 శాతం, టన్నెల్ 2 బెంచింగ్ 94 శాతం, లైనింగ్ 66 శాతం, ఫీడర్ కెనాల్ రిటైనింగ్ వాల్ కాంక్రీట్ 84 శాతం, లైనింగ్ 8 శాతం పూర్తయ్యాయి. తీగ లేరు కెనాల్ హెడ్ రెగ్యులేటర్ గేట్లు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్, డైవర్షన్ రోడ్ పనులు పురోగతిలో ఉన్నాయి. మొత్తం వెలిగొండ పనులు జూన్ చివరి కల్లా పూర్తి చేయాలని లక్ష్యం కాగా, దీనికి రూ.2,042 కోట్లు వ్యయం కానుంది. మల్యాల ఎత్తిపోతల ద్వారా 52 టీఎంసీల శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను ఇప్పటివరకు రాయలసీమకు తరలించినట్టు అధికారులు సీఎంకు తెలిపారు. హంద్రీ నీవా ఫేజ్ 1 కెనాల్ విస్తరణ పనులు 92 శాతం పూర్తికాగా, ఫేజ్ 2 లింకింగ్ కుప్పం, పుంగనూరు కెనాల్స్ 85 శాతం పూర్తయ్యాయి. 618 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు గాను 432 ట్యాంకులను పూర్తిగా నింపగా, 98 ట్యాంకులు పాక్షికంగా నింపినట్టు వివరించారు. మెయిన్ కెనాల్ బ్యాలెన్స్ వర్క్స్ 400.50 కి.మీ నుంచి 490 కి.మీ వరకు ఉంది. వీటి కోసం రూ.577.77 కోట్లు అవసరం కాగా, 490 కి.మీ. నుంచి 554.17 కి.మీ. నీవా బ్రాంచ్ కెనాల్ పనులకు 310.44 కోట్లు అవసరం కానున్నాయి. నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా రూ.126.06 కోట్లతో మూల పల్లి ట్యాంక్‌తో పాటు మరో 4 ట్యంకులు, కళ్యాణి డ్యామ్‌కు నీటిని తరలించాల్సి ఉంది. దీనికీ ఏజెన్సీతో ఒప్పందం పూర్తయిందని అధికారులు వివరించారు.

**పోలవరం -- నల్లమల సాగర్ లింక్..** 200 టీఎంసీల గోదావరి వరద నీటిని బొల్లాపల్లి రిజర్వాయ-ర్, నల్లమల సాగర్‌కు తరలించేందుకు రూ.58,700 కోట్లు ఖర్చు కానుందని, దీనికి సంబంధించి సీడబ్ల్యూసీ నుంచి డీపీఆర్ కు అక్టోబర్ 31 కల్లా ఆమోదం లభిస్తుందని అధికారులు తెలిపారు. అటవీ, పర్యావరణ అనుమతులు ఆర్ అండ్ ఆర్ క్లియరెన్స్ సెప్టెంబర్ 30కి పూర్తి కానున్నాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. చింతలపూడి లిఫ్ట్‌కు పర్యావరణ అనుమతులు వచ్చాయని, ఈ ప్రాజెక్టుకు రూ.8,075 కోట్ల వ్యయం కానుందని అంచనాలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ పనులు చేప్టటి, 2027 జూన్‌కు పూర్తి చేయాల్సి ఉండగా, దీనికి రూ.2,042 కోట్లు అవసరం కానున్నాయి. ప్రధాన కాలువకు అవసరమైన 910 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం రూ.152 కోట్లను కేటాయించింది. అటు వరికెపుడిశెల ఎత్తిపోతల పథకానికి రూ.3,278 కోట్లు ఖర్చు కానుందని, దీని ద్వారా 84,500 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

**పెరిగిన భూగర్భ జలాలు..** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయి. ఏప్రిల్ 1 నాటికి భూగర్భ జలాలు 625 టీఎంసీల అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది 12 టీఎంసీల నీరు అదనంగా ఉంది. మొత్తంగా 5,697 గ్రామాల్లో 8 మీటర్‌లకు పైగా భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. గ్రౌండ్ వాటర్ 2025 ఏప్రిల్‌కు ఏపీలో 9.47 మీటర్లు ఉండగా కోస్తాంధ్రలో 8.88 మీటర్లు, సీమలో 10.94 మీటర్లు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌కు ఆంధ్రప్రదేశ్‌లో 8.68 శాతం ఉండగా, కోస్తాంధ్రలో 8.39 మీటర్లు, రాయలసీమలో 9.41 మీటర్లు ఉన్నాయి. మొత్తంగా గత ఏడాదితో ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏప్రిల్ నాటికి 0.79 మీటర్ల మేరకు భూగర్భ జలాలు పెరిగాయి. రాష్ట్రంలో జలధార -- జల హారతి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 13,138 గ్రామాల్లో లక్ష్యం నిర్దేశించుకోగా... 2,664 గ్రామాల్లో కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ గ్రామాల్లో చేపట్టాల్సిన 3,591 పనులను గుర్తించారు. రాష్ట్రంలో మొత్తం 1,002 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు గాను...గత ప్రభుత్వంలో నిర్వహణ లేని కారణంగా 244 పథకాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, మిగిలిన 758 ఎత్తిపోతల పథకాలను థర్డ్ పార్టీ ద్వారా 5 ఏళ్ల పాటు నిర్వహించడానికి రూ.1637.66 కోట్లు ఖర్చు కానుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జల వనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్





**చంద్రగిరి,కలంకౌంటర్ :** తిరుపతి జిల్లా చంద్రగిరిలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన నారా రామ్మూర్తినాయుడు క్రీడా వికాస కేంద్రాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందు క్రీడా ప్రాంగాణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు హాకీ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియాన్ని మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ తో కలిసి బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. చిన్నారులతో టేబుల్ టెన్నిస్, హాకీ ఆడారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. సీఎం చంద్రబాబు నాయుడు గారి సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం ఆయన పేరిట రూ.3.17 కోట్లు వెచ్చించి ఈ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జాతీయస్థాయిలో క్రీడలు నిర్వహించుకునేందుకు వీలుగా ఈ కేంద్రాన్ని నిర్మించారు. సీఎం చంద్రబాబు గారు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలో క్రీడా వికాస కేంద్రాన్ని 2017లో మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోవడంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక చొరవ తీసుకుని క్రీడా వికాస కేంద్రాన్ని తీర్చిదిద్దారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, స్కిప్పింగ్, చెస్, జిమ్, యోగా వంటి క్రీడా సదుపాయాలు, అవుట్ డోర్ లో వాలీబాల్, కబడ్డీ, కోకో, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు హాకీ క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకుతెచ్చారు. ఈ క్రీడా వికాస కేంద్రం చంద్రగిరి పరిసర ప్రాంతాల క్రీడాకారులకు శిక్షణ, అభివృద్ధికి వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీపతి బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, దండు పూజ, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

# పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన తెలుగుదేశం పార్టీ

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంత్రి నారా లోకేష్
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్
- సీనియర్లకు గౌరవం... కొత్తవారికి అవకాశాలు...సామాజిక కోణం కోణంలో నూతన కమిటీల కూర్పు
- విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి పదవులు ఇచ్చిన అధిష్టానం
- నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం

**అమరావతి,కలంకౌంటర్ :** పొలిట్ బ్యూరోలో అనూహ్య మార్పులు.... ప్రతి కమిటీలోను నూతనత్వం 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు. జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10 రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్ల-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77. నాలెడ్జి కమిటీ, హెచ్ఆర్డీ కమిటీల్లో ఒక్కొరి చొప్పున నియామకం. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై కసరత్తు చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు. గతానికి భిన్నంగా పార్టీ కమిటీల కూర్పును కొత్త పుంతలు తొక్కించిన ముఖ్యమంత్రి ్నగత కొంత కాలంగా చెబుతున్నట్టే పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి, విధేయులకు పెద్ద పీట. ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్చార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్చార్జ్ గుత్తికొండ ధనుంజయ్. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం. జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించిన టీడీపీ అధిష్టానం బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన చంద్రబాబు. బీసీలకు 40 శాతం, ఎస్సీలకు 25 శాతం, ఎస్టీలకు 3.8 శాతం, మైనార్టీలకు 7 శాంత చొప్పున కమిటీలో స్థానం కల్పించిన టీడీపీ అధినాయకత్వం. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి కమిటీల కూర్పు చేపట్టిన చంద్రబాబు పార్టీకి యువ నాయకత్వం అందుబాటులోకి వచ్చేలా నియామకాలు. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ, 33 శాతం మహిళా రిజర్వేషన్లను దృష్టిలో పెట్టుకుని కసరత్తు చేసిన చంద్రబాబు గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్ద పీట వేస్తూ కమిటీల కూర్పు.


# తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వక్కలగడ్డ మల్లికార్జున



**మార్కాపురం, కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ ఆర్యవైశ్య సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ పటిష్టత కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి, కష్టకాలంలో తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన వ్యక్తి, మార్కాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషిచేసిన నందుకు తెలుగుదేశం పార్టీ గుర్తించి ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు వక్కలగడ్డ మల్లికార్జున కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కి, యువ నాయకులు నారా లోకేష్ కి మల్లికార్జున ధన్యవాదాలు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలువురు ఆర్యవైశ్యులు, టిడిపి నాయకులు మల్లికార్జున కు శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతల భేటీ..

**అమరావతి,కలంకౌంటర్ :** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమావేశం. పార్లమెంటులో ప్రవేశపెడుతోన్న నారీ శక్తి వందన్ చట్ట సవరణ బిల్లుపై సమావేశంలో చర్చ. బిల్లు ఆమోదం పొందాక చేపట్టాల్సిన నారీ శక్తి విజయోత్సవాలు, కార్యాచరణపై ఎన్డీఏ పక్ష నేతల సమాలోచనలు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వాలని కోరుతూ రాష్ట్రంలోని వివిధ పార్టీల అధ్యక్షులకు, ఎంపీలకు ఇప్పటికే లేఖలు రాసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.



# అన్నా క్యాంటీన్ ప్రారంభించిన చంద్రబాబు









**అమరావతి,కలంకౌంటర్ :** పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో కార్మికులతో కలిసి అన్నక్యాంటీన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం పేదలకు స్వయంగా భోజనం వడ్డించిన ముఖ్యమంత్రి. లబ్ధిదారులతో మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లోనే భోజనం చేసిన సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇవాళ గ్రామీణ ప్రాంతాల్లో మరో 62 అన్న కాంటీన్లను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రాష్ట్రంలో 269 పెరిగిన అన్న క్యాంటీన్ల సంఖ్య త్వరలో మరో 5 అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించిన ప్రభుత్వం గడచిన 21 నెలల్లో 8.80 కోట్ల భోజనాలను పేదలకు అందించిన అన్న క్యాంటీన్లు ప్రతీ రోజూ ఒక్కో అన్న క్యాంటీన్ లో సగటున 1013 మందికి భోజన సదుపాయం రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో పేదలకు భోజన వసతి కోసం రూ.243 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం.

# అవోపా ఆద్వర్యంలో



**చీరాల,కలంకౌంటర్ :** అవోపా కార్యాలయములో వికలాంగులు , వృద్ధులకు పెన్షను బియ్యము, భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మువ్వల సాంబశివరావు రిటైర్డ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దాతల సహాయముతో ఎన్నో కార్యక్రమములను నిర్వహిస్తున్న అవోపా సేవల్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ మారుటూరి రాఘవేంద్ర రావు, అద్యక్షులు వలివేటి మురళీకృష్ణ, కార్యదర్శి పోలిశెట్టి శ్యామ్ సుందరరావు ,కోడూరి ఏకాంబరేశ్వర బాబు, గురుప్రసాద్, మస్తాన్ రావు, పబ్బిశెట్టి రామారావు, శివప్రసాద్,తదితరులు పాల్గొన్నారు. జూన్ నెలలో జరుగు అత్యుత్తమ మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్షిప్ లు అందజేస్తున్నట్లు తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ పదవులు పొందిన ఆర్యవైశ్యులకు శుభాకాంక్షలు

- పార్టీ పదవుల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించిన తెలుగుదేశం పార్టీకి ధన్యవాదాలు

**ఒంగోలు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ బుధవారం ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, యువ నాయకుడు నారా లోకేష్ కి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా నియమితులైన జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య తాతయ్య కి, జాతీయ అధికార ప్రతినిధిగా నియమితులైన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ కి, కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన గుంతకల్లుకు చెందిన పత్తి హిమబిందుకి, రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన పొదిలికి చెందిన గునుపూడి భాస్కర్ కి, మార్కాపురానికి చెందిన వక్కలగడ్డ మల్లికార్జున రావు కి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులు, కోశాధికారి రావికింది నరసింహారావు శుభాకాంక్షలు తెలిపారు.

కలంకౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
కలంకౌంటర్ దినపత్రిక లో యాడ్స్ కోసం సంప్రదించండి..
సెల్ : 9346935672

# లోకేశ్ నాయకత్వంలో టీడీపీ మరింత బలోపేతం

## –రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,కలంకౌంటర్ :** మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో టీడీపీ మరింత బలోపేతం కావడం ఖాయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ రాక్షస పాలన నుంచి ఏపీని కాపాడిన ఘనత మంత్రి లోకేశ్ దేనన్నారు. యువగళం పాదయాత్రి నిర్వహించి, నిస్తేజంలో క్యాడర్ లో ఉత్సాహాన్ని నింపారన్నారు. ప్రజల్లో భవిష్యత్తు పట్ల సానుకూల దృక్పథం తీసుకొచ్చారన్నారు. తన పాదయాత్రతో రాష్ట్రంలో పసుపు జెండా రెపరెపలకు నాంది పలికారన్నారు. రాష్ట్ర అభివృద్ధిపైనా, యువతకు ఉద్యోగాల కల్పనపైనా స్పష్టమైన అవగాహన ఉందన్నారు. అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని తన రెండు భుజాలపై మోసుకుని, ఏపీని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. గాడి తప్పిన విద్యా వ్యవస్థను సక్రమ మార్గంలో పెట్టి, 150కి పైగా కేసులు వేసినా వాటన్నింటినీ అధిగమిస్తూ 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత ఆయనదేనన్నారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, ఆరోపణలకు తావివ్వకుండా టీచర్ల బదిలీలు చేపట్టారన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్ లు నిర్వహించి, పాఠశాల నిర్వహణలో తల్లిదండ్రులను భాగస్వామ్యులు చేశారన్నారు. ఇది తన శాఖ అని గిరుగీసుకుని పనిచేయకుండా, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. కేవలం 22 నెలల కాలంలో ఏపీకి 25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రావడంలో మంత్రి నారా లోకేశ్ దే కీలక పాత్ర అని మంత్రి సవిత కొనియాడారు. గూగుల్, అర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ, క్వాంటం వ్యాలీ వంటి ఎన్నో కీలక పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకురావడం వెనుక లోకేశ్ కష్టం ఉందన్నారు. అధినేతే కార్యకర్త అంటూ శ్రేణులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. పసుపు జెండా భుజనా పెట్టుకుని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్, పార్టీ పదువులను మంత్రి లోకేశ్ ఇస్తున్నారన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి, నిఖార్సయిన నాయకుడిగా లోకేశ్ గుర్తింపు పొందరాదని, ఆయన నాయకత్వంలో పనిచేయడం తన అదృష్టమని తెలిపారు. ఆయన నాయకత్వంలో టీడీపీ మరింత ఉన్నత స్థానాలకు చేరడం ఖాయమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు.

## అరుదైన గ్రూపు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న బెల్లం జయంత్ బాబు



**ఒంగోలు,కలంకౌంటర్ :** ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న ఒక పేషెంట్ కి హార్ట్ సర్జరీ నిమిత్తం అత్యవసరంగా అత్యంత అరుదు గ్రూపు అయిన ఏబి నెగిటివ్ రక్తం అవసరం అని బ్లడ్ డోనర్స్ వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఒక మెసేజ్ ని చూసిన వెంటనే స్పందించిన టంగుటూరు మాజీ సర్పంచ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త బెల్లం జయంత్ బాబు ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్ కి వెళ్లి రక్తదానం చేశారు. అలాగే పేషెంట్ ని పరామర్శించి వారి బంధువులకు ధైర్యం చెప్పి తన యొక్క మానవత్వాన్ని చాటుకున్నారు. నాలుగు రోజుల నుండి ఈ అరుదైన రక్త గ్రూపు ఏబీ నెగిటివ్ రక్తం దొరక్క ఆపరేషన్ వాయిదా పడుతూ ఉన్నదని ఆపద సమయంలో రక్తదానం చేసి ఆదుకున్న బెల్లం జయంత్ బాబు కి పేషెంట్ తరపు బంధువులు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జయంత్ బాబు మాట్లాడుతూ యువత అందరూ రక్తదానాన్ని అలవాటుగా చేసుకుని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చెన్న వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ జయంత్ బాబు గతంలో అనేకసార్లు రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడారని తెలిపారు.

## పారిశుద్ధ్యం మెరుగుపడాలి - ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలో పారిశుద్ధ్యం తక్షణమే మెరుగుపడాలని దీంతో ప్రజారోగ్యం పరిరక్షించబడుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఉదయం ఆయన కందుకూరు పట్టణంలోని కోవూరు రోడ్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య పరిశీల నిమిత్తం డ్రైనేజీలను పరిశీలించారు. అక్కడ స్థానికులతో పారిశుధ్యనిర్వహణ పై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణం పారిశుధ్యలో మిగతా పట్టణాలకు తలమానికంగా నిలవాలని ఆయన పురపాలక సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి స్వీయ జన గణన ప్రక్రియ ప్రారంభం

**ఉయ్యూరు,కలంకౌంటర్ :** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన 2027 తొలి దశ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుందని ఉయ్యూరు మండల తహసిల్దార్ కే సురేష్ కుమార్ తెలిపారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పౌరులు గణన సిబ్బంది రాకముందే తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యుమరేషన్ సదుపాయం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు ఈ నమోదు కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా అధికారిక సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌లోకి వెళ్లి, ఆధార్, మొబైల్ నంబర్ సహాయంతో ఇంటి నంబరు, కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. స్వీయ గణన పూర్తయ్యాక లభించే 11 అంకెల ఎస్ ఈ ఐడీ ను భద్రపరచుకుని, మే నెలలో ఇంటికి వచ్చే గణన అధికారికి చూపిస్తే ఎన్యూమరేటర్ సమాచారం సరి చూసి నిర్ధారిస్తారని వివరించారు. ఈ విధానం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు గణన ప్రక్రియ సులభతరం అవుతుందని తెలిపారు. దేశ అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. నమోదులో ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు ఎదురైనా సాంకేతిక నిపుణులను సంప్రదించి సహాయం పొందవచ్చని సూచించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ అయినప్పటికీ, ఉయ్యూరు మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని తహసిల్దార్ పిలుపునిచ్చారు.

## నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్





**నెల్లూరు,కలంకౌంటర్ :** నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. నెల్లూరు వీపీఆర్ కన్వెన్షన్ లో జరిగిన వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులు ప్రజయ్ సేనారెడ్డి, డాక్టర్ జాహ్నవిలను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శిగా డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ బుధవారం ప్రకటించిన పార్టీ పదవుల్లో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ప్రభుత్వ విప్, కుప్పం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు చోటు దొరికింది. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయదుందుభి మోగించి తెలుగుదేశం పార్టీకి రాష్ట్రంలో కొత్త ఉత్సాహాన్ని తీసుకుని వచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కష్టపడే తత్వాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుర్తించి కుప్పం నియోజకవర్గ ఇన్చార్జిగా, ప్రభుత్వ విప్ గా, కుప్పం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమించారు. బుధవారం ప్రకటించిన పార్టీ పదవుల్లో కార్యనిర్వహక కార్యదర్శిగా అవకాశం కల్పించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, యువనేత నారా లోకేష్ కు శ్రీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు తెలుగుదేశం పార్టీ నాయకులు, పలువురు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.



కృష్ణా జిల్లా మచిలీపట్నం బుధవారం రాత్రి జిల్లా ఎస్పీ కలిసేందుకు కార్యాలయంకు వచ్చిన మాజీ మంత్రి పేర్ని నాని మాజీ గన్నవరం శాసనసభ్యులు వల్లభనేని వంశీ. సోషల్ మీడియాలో వంశీ చిత్రాలను మార్ఫింగ్ చేసి ప్రతిష్టను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారంటూ అడిషనల్ ఎస్పీ నాయుడుకు ఫిర్యాదు చేసిన వైసీపీ పార్టీ నాయకులు పేర్ని. వంశీ

**–మచిలీపట్నం,కలంకౌంటర్ :**

# శుభాకాంక్షలు



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు గా మాజీ శాసనమండలి సభ్యులు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంట్రప్రగడ వీరాంజనేయులు, యువజన విభాగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజ, కొల్లిపర హేమంత్.

# జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన







**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విస్తృతంగా పర్యటించి వివిధ సంక్షేమ పథకాలు కార్యక్రమాల అమలవుతున్న తీరు తెన్నులను నేరుగా తెలుసుకున్నారు. రైతులు, ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత జిల్లా కలెక్టర్ మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామంలో రి సర్వే ప్రక్రియ ఎలా జరిగిందని విచారించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ముందుగా నోటీసు ఇచ్చారా లేదా సంతృప్తికరంగా ఉందా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడి పలు రికార్డులు, సిస్టంలో రి సర్వే డేటా వివరాలను పరిశీలించారు. తదనంతరం రావివారిపాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఈ హెచ్ ఆర్ రికార్డు, ఓపి నుండి ఫార్మసీ ఆన్లైన్లో నమోదు చేశారా లేదా అని వివరాలను వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పుల కేసులకు సంబంధించి కనీసం 2 నుంచి 5 ప్రసవాలు కచ్చితంగా జరగాలని సూచించారు. ప్రస్తుతం వడగాలులు వీస్తున్న దృష్ట్యా అన్ని రకాల మందులు ఐ వి ఫ్లూయిడ్లు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా లేదా వైద్యం సరిగా అందిస్తున్నారా లేదా ఉచితంగా మందులు ఇస్తున్నారా లేదా అని కలెక్టర్ రోగులను అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాలు త్వరలో పూర్తిచేసి ఆరోగ్య కేంద్రానికి అప్పగించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్అండ్బి అధికారులకు సూచించారు. తదుపరి గ్రామంలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి అక్కడ కొత్తగా నిర్మిస్తున్న గదుల నాణ్యతను పరిశీలించారు. అక్కడి విద్యార్థినులతో ఎలా చదువుకుంటున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డిఎంహెచ్వో డాక్టర్ యుగంధర్,, మోపిదేవి మండల తాసిల్దార్ హరిహరనాథ్ సర్వే సిబ్బంది సచివాలయ సిబ్బంది రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ నాటికి పెండింగ్ గృహాలన్నీ పూర్తి కావాలి - మంత్రి కొలుసు పార్థసారథి



**విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణ పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, వచ్చే సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. బుధవారం గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పథకాల వారీగా పురోగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆప్షన్–3 గృహాలపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి, ఆప్షన్–3 కింద నిర్మిస్తున్న గృహాలన్నింటినీ సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని సూచించారు. అలాగే జూన్ నెలాఖరు నాటికి కనీసం 50 శాతం పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు.

**కేంద్ర, రాష్ట్ర పథకాల సమీక్ష:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన (PMAY-1 & PMAY-2) పథకాల అమలును సమీక్షిస్తూ, గృహ నిర్మాణ పనుల వేగాన్ని మరింత పెంచాలని మంత్రి సూచించారు.

**ఎన్‌టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణం:** ఈ పథకం కింద జరుగుతున్న పనుల్లో వేగంతో పాటు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు.

**సమస్యల పరిష్కారం:** లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, భూ సమస్యలు లేదా నిర్మాణ సామగ్రి సరఫరాలో ఎదురయ్యే అడ్డంకులను తక్షణమే పరిష్కరించాలని మంత్రి సూచించారు.

**ప్రభుత్వ లక్ష్యం:** ప్రతి అర్హులైన పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, నిర్ణీత కాలవ్యవధిలో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ లో ‘ఎంజేపీ’ సత్తా

- విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి మంత్రి సవిత అభినందనలు






**అమరావతి ,కలంకౌంటర్ :** ఇంటర్ ఫలితాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఫస్ట్ ఇంటర్ లో 97 శాతం, సెకండ్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ బిడ్డలు ఉత్తీర్ణులయ్యారు. జూనియర్ బైపీసీ, ఎంపీసీలో స్టేట్ మొదటి రెండు ర్యాంకులు, సీఈసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు సాధించడం విశేషం. జూనియర్ ఇంటర్ లో మూడు ఎంజేపీ గురుకులాలు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించగా, సీనియర్ ఇంటర్ లో ఏడు గురుకులాల వంద శాతం మేర ఫలితాలు సాధించాయి. వాటిలో మూడు గురుకులాలు సీనియన్, జూనియర్ ఇంటర్ లో వంద శాతం ఫలితాలు రాబట్టాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అన్ని రకాల విద్యా సంస్థల్లో ఇంటర్ ఫలితాల్లో జూనియర్ ఇంటర్ లో ఎంజేపీ గురుకుల విద్యార్థులు 97 శాతంతో మొదటి వరుసలో నిలిచారు. సీనియర్ ఇంటర్ లో 94 శాతంతో రెండో స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నారు. రాష్ట్రస్థాయి ఫలితాల కంటే ఎంజేపీ గురుకుల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం అధికం ఉండడం విశేషం. ఇంటర్మీడియట్ ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం విడుదల చేశారు. జూనియర్ ఇంటర్ లో 77 శాతం, సీనియర్ ఇంటర్ లో 81 మంది శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు నెల రోజులు పాటు కొనసాగి, మార్చి 24వ తేదీతో ముగిశాయి. జూనియర్ ఇంటర్ పరీక్షలకు 5,10,307 మంది, సీనియర్ ఇంటర్ కు 5,05,609 మంది మొత్తం 10,15,916 మంది హాజరయ్యారు.

**జూనియర్ బైపీసీలో 1, 2 స్టేట్ ర్యాంకులు ఎంజేపీవే...**

జూనియర్ ఇంటర్ లో ఎంజేపీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఫస్ట్ ఇంటర్ లో 97 శాతంతో బీసీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. 18 గురుకుల కళాశాలలకు చెందిన మొదటి సంవత్సరం పరీక్షలకు 1,728 మంది హాజరుకాగా, 1,663 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఫలితాలతో పాటు మూడు గ్రూపుల్లోనూ స్టేట్ ర్యాంకులు సాధించి ఎంజేపీ విద్యార్థినులు విజయ ఢంకా మోగించారు.

## దొంగల్లా మఫ్టీలో వచ్చి అరెస్టు చేస్తారా? -వెల్లంపల్లి



**విజయవాడ,కలంకౌంటర్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మీడియా విభాగం సమన్వయకర్త పూడి శ్రీహరి ని తెల్లవారుజామున మఫ్టీలో వచ్చిన పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఈ అరాచక అరెస్టుపై బుధవారం ఆయన ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఆ ప్రకటన ఆయన మాట్లాడు తూ ?"రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన సాగుతుందా లేక అడవి చట్టం అమలవుతుందా? అని ప్రశ్నించారు. ఒక బాధ్యతాయుతమైన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని,మీడియా విభాగాన్ని పర్యవేక్షించే వ్యక్తిని కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా,తెల్లవారుజామున మఫ్టీలో వచ్చి దొంగల మాదిరిగా ఎత్తుకెళ్లడం దారుణం అని అన్నారు.ప్రభుత్వం తన చేతకానితనాన్ని ప్రశ్నిస్తున్నారనే భయంతోనే ఇటువంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతోందన్నారు.మీడియా గొంతు నొక్కడం ద్వారా మీ వైఫల్యాలను దాచలేరన్నారు.యూనిఫాంలో రావడానికి భయపడి,మఫ్టీలో వచ్చి అరె-స్టులు చేయాల్సిన కర్మ ఈ ప్రభుత్వానికి ఎందుకు పట్టింది?" అని వెల్లంపల్లి ప్రశ్నించారు.?"పూడి శ్రీహరి అరెస్టు కేవలం వ్యక్తిగతం కాదన్నారు.ఇది భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి అని అన్నారు.పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను మానసికంగా దెబ్బతీయాలని చూస్తే,అది పాలకుల భ్రమే అవుతుందన్నారు.ఈ అరాచకాలకు,అక్రమ కేసులకు మేం భయపడే ప్రసక్తే లేదన్నారు.

## అన్నా క్యాంటీన్ కు విరాళం ఇచ్చిన ఉపాధ్యాయుడు చెరుకూరి శ్రీనివాస్

### ముఖ్యమంత్రికి చెక్కు అందజేత




**నరసరావు పేట,కలంకౌంటర్ :** బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి మండల కేంద్రంలో ప్రారంభించిన అన్నా క్యాంటీన్ నిర్వహణ కోసం ఉపాధ్యాయులు చెరుకూరి శ్రీనివాస్ రూ.1,17,000 విరాళం అందించారు. హెలీ ప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలిసి చెక్కు అందజేశారు. తాడికొండ జెడ్పీహెచ్ఎస్ లో ఇంగ్లీష్ అసిస్టెంట్ గా పని చేస్తున్న చెరుకూరి శ్రీనివాస్ 2016లో రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.20,000, అనంతరం 2019లో జన్మభూమి కార్యక్రమం కోసం రూ.50,000 విరాళంగా అందించారు. రాష్ట్ర అభివృద్ధికి ఎప్పటికప్పుడు తనకు చేతనైన సహాయం చేస్తున్న చెరుకూరి శ్రీనివాస్ ను ముఖ్యమంత్రి అభినందించారు.

## సత్యసాయి జిల్లా పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**అమరావతి, కలంకౌంటర్ :** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన ఘోర ప్రమాదంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిలెటిన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్లు పేలిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం మనసుని కలచివేసిందని అన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగన్... గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని, పేలుడు ధాటికి ఇళ్లు కూడా ధ్వంసమవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

## జిల్లాస్థాయిలో సత్తా చూపిన లేడియాంప్తుల్ విద్యార్థినిలు....



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** గురువారం ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాల కంటే మచిలీపట్నం లేడీ యాంప్తుల్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు జిల్లాలో ప్రథమ స్థాయిలోనూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జిల్లాలో రెండవ స్థానంలో నిలిచి కాలేజీ యొక్క ప్రతిష్టను పెంచారు. మొదటి సంవత్సరం 327 మంది విద్యార్థులు హాజరు కాగా 269మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం 311 మంది హాజరు కాక 281 మంది ఉత్తీర్ణులయ్యారు. గత సంవత్సరాల కంటే ఎంతో మెరుగుగా కళాశాల ఫలితాలు రావడం పట్ల కళాశాల అభివృద్ధి కమిటీ మాజీ కార్యదర్శి కొల్లు శ్రీనివాసరావు సభ్యులు లంకిశెట్టి బాలాజీ, అభినందనలు తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలను జిల్లాస్థాయిలో నిలిపినందుకు కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి ఇతర అధ్యాపకులను అభివృద్ధి కమిటీ అభినందనలు తెలియజేసింది

## పేదలకు అన్నదానం.. లంకిశెట్టి సర్కిల్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ తరఫున మచిలీపట్నం దేవుడు తోట యానాదుల కాలనీలో బుధవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లంకి శెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు ఇండియన్ నేవీ అధికారి పెన్నేరు రవితేజ సాఫ్ట్వేర్ ఇంజనీర్ నాగ సాయి శ్రావణి మ్యారేజ్ డే పురస్కరించుకుని బుధవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మ్యారేజ్ డే పేరుతో విలాసవంతమైన కార్యక్రమాలు కాకుండా ఆకలితో ఉన్న పేదవారికి పట్టేడు అన్నం పెట్టడంలోనే ఆనందం ఉంటుందని నాగ సాయి శ్రావణి అన్నారు. అర్ధాకలి తో ఉన్న పేదవాని గుర్తించి వారు కడుపు నింపటం మాధవసేవతో సమానమని న్యాయవాది లంకి శెట్టి బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నేరు సింధు తేజ, పెన్నేరు వైష్ణవి, రిత్విక, కొమిరిపాలెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో మూడవరోజు మజ్జిగ పంపిణీ నిర్వహించారు . మజ్జిగదాత పొట్ట షణ్ముఖ (శ్రీరామ్ జ్యువెలర్స్) తో పాటు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మురళి నాథ్, ట్రెజరర్ వేదా లక్ష్మీనరసింహం, కొండూరు భద్రం తదితర సభ్యులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల్లో రెండో రోజు పోస్టర్ల పంపిణీ



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం బంటుమిల్లి అగ్నిమాపక అధికారీ జి రామ్మోహన్ రావు సారధ్యంలో అగ్నిమాపక సిబ్బంది బంటుమిల్లి పట్టణంలోని పలు ప్రాంతాలలో వారోత్సవాల పోస్టర్లను అంటించడం అలాగే పలు ప్రాంతాలలో అగ్ని మా పక్క వారోత్సవాల గురించి అలాగే అగ్ని ప్రమాదాల నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. దీంట్లో భాగంగా బంటుమిల్లి బస్టాండ్ సెంటర్, వంశీ ఎలక్ట్రానిక్స్ వద్ద అలాగే దుర్గ మహల్ సెంటర్ లోనూ నాగేశ్వరావుపేట జానకిరాంపురం ఎస్సీ కాలనీలో ప్రజలకు అగ్నిమాపక వారోత్సవాల పైన అలాగే అగ్ని ప్రమాదాలు నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు పోస్టర్ను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు

## తనిఖీలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్ వద్ద పోలీసులు కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. తాలూకా ఎస్సై ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రైవ్‌లో ప్రతి వాహనాన్ని ఆపి డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలను సమగ్రంగా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. రోడ్డు భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. అలాగే, బీచ్ ప్రాంతంలో సాయంత్రం తర్వాత అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పహారా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతూ కఠిన చర్యలు చేపడుతున్నారు.







Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com